నేటి మ్యాచ్ | ఆస్ట్రేలియా X అఫ్గానిస్థాన్ | మ. 2.00 నుంచి | వేదిక: ముంబై

హేమలతకు రజతం

పనాజీ: గోవా వేదికగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మక నేషనల్ గేమ్స్‌లో తెలంగాణ ప్లేయర్లు సత్తాచాటుతున్నారు. సోమవారం జరిగిన మహిళల రోయింగ్ సీడబ్ల్యూ1ఎక్స్ ఈవెంట్‌లో హేమలత రజత పతకంతో మెరిసింది. ప్రత్యర్థులకు దీటైన సవాలు విసురుతూ హేమలత అద్భుత ప్రదర్శన కనబరిచింది. జాతీయ స్థాయిలో ఆకట్టుకున్న ఈ యువ ప్లేయర్ స్పోర్ట్స్ స్కూల్‌లో విద్యనభ్యసిస్తున్నది

విజేత పంజాబ్

సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీ

మొహాలి : దేశవాళీ టి20 టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ చాంపియన్‌షిప్‌లో పంజాబ్ విజేతగా నిలిచింది. ఫైనల్లో పంజాబ్ 20 పరుగుల తేడాతో బరోడాని ఓడించి ట్రోఫీని సొంతం చేసుకుంది. తొలుత పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 223 పరుగుల భారీ స్కోరును సాధించింది. అన్‌మోల్‌దీప్ సింగ్ సెంచరీ(61 బంతుల్లో 113) సాధించగా, నేహల్ వధేర మెరుపు ఇన్నింగ్స్(27 బంతుల్లో 61)తో ప్రత్యర్థి ఎదుట భారీ లక్ష్యాన్ని ఉంచింది. సమాధానంగా బరోడా చివరివరకు గట్టిపోటీ ఇచ్చి 7 వికెట్లకు 203 పరుగులు మాత్రమే చేయగలిగింది. అభిమన్యు(61), కెప్టెన్ కృనాల్ పాండ్యా(45), సోలంకి(28) విజయం కోసం పోరాడినా ఫలితం లేకపోయింది. అభిషేక్ శర్మ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు దక్కించుకున్నాడు.

విదిత్, వైశాలికి టైటిల్స్

ఐజిల్ ఆఫ్ మ్యాన్ : ఫిడే గ్రాండ్ స్విస్ చెస్ టోర్నీలో భారత ఆటగాళ్లు విదిత్ గుజరాతి, ఆర్.వైశాలి టైటిల్స్ సాధించారు. అంతేగాక వీరిద్దరూ క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించారు. ఓపెన్ కేటగిరీలో విదిత్ చివరి రౌండ్‌లో సెర్బియాకు చెందిన అలెగ్జాండర్ ప్రెడ్కెను ఓడించి ఏడో విజయాన్ని నమోదు చేసుకున్నాడు. 8.5 పాయింట్లు సాధించిన విదిత్ అగ్రస్థానంలో నిలిచి టైటిల్ దక్కించుకున్నాడు. కాగా వైశాలి మంగోలియా క్రీడాకారిణి బత్కుయాగ్ ముంగ్‌తూల్‌తో మ్యాచ్‌ను డ్రా చేసుకుని 8.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి టైటిల్ అందుకుంది. టైటిల్స్‌తో పాటు విదిత్ రూ.66 లక్షలు, వైశాలి రూ.20 లక్షలు ప్రైజ్‌మనీ గెలుచుకున్నారు.

అజర్‌కు ఊరట

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) మాజీ అధ్యక్షుడు మహమ్మద్ అజారుద్దీన్‌కు ఊరట లభించింది. ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో తనపై నమోదైన కేసులపై మల్కాజిగిరి కోర్టు సోమవారం ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. అయితే 41 సీఆర్‌పీసీ కింద నోటీసులు ఇచ్చి అజర్‌ను విచారించాలని ఆదేశించింది. పోలీసుల విచారణకు అజర్ సహకరించాలని స్పష్టం చేసింది. ఇదిలా ఉంటే అజర్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కోట్లాది రూపాయల గోల్‌మాల్ జరిగినట్లు సుప్రీం కోర్టు నియమించిన జస్టిస్ నాగేశ్వర్‌రావు ఏక సభ్య కమిటీ తేల్చింది. నిధులు దుర్వినియోగం చేసినట్లు అజర్‌పై ఉప్పల్ పీఎస్‌లో నాలుగు కేసులు నమోదయ్యాయి.

శ్రీలంక క్రికెట్ బోర్డు రద్దు

కొలంబొ : ప్రపంచకప్‌లో శ్రీలంక క్రికెట్ జట్టు నిరాశజనక ప్రదర్శన ఆ దేశ క్రికెట్ బోర్డుకే ముప్పుతెచ్చింది. సెమీస్‌కు అర్హత కోల్పోవడమేకాక, భారత జట్టు చేతిలో 302 పరుగుల తేడాతో ఓడిపోవడం ఆ జట్టును ప్రమాదంలోకి నెట్టింది. జట్టు ప్రదర్శనతో నిరసనలు వెల్లువెత్తడంతో దేశ క్రీడా మంత్రి లంక బోర్డును వివరణ కోరగా, సోమవారం ప్రభుత్వం క్రికెట్ బోర్డును రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. లంక జట్టు ప్రదర్శనపై మాజీ కెప్టెన్ అర్జున రణతుంగ నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో విచారణ కమిటీని నియమిస్తూ క్రీడామంత్రి రోషన్ రణసింగె ఉత్తర్వులు జారీచేశారు. లంక క్రికెట్ బోర్డు అధ్యక్షుడు షమిల్వ పాలనా విధానాలను రణతుంగ మొదటినుంచి ప్రశ్నిస్తూనే ఉన్నాడు.

బ్రెజిల్ గ్రాండ్‌ప్రి విజేత వెర్‌స్టాపెన్

సావొపాలొ : మూడుసార్లు చాంపియన్ మాక్స్ వెర్‌స్టాపెన్ ఆదివారం జరిగిన బ్రెజిల్ గ్రాండ్‌ప్రి రేస్‌ను గెలుచుకున్నాడు. ఆరంభంనుంచి ఆధిపత్యం ప్రదర్శించిన వెర్‌స్టాపెన్ అదే జోరు కొనసాగించి టైటిల్ నెగ్గాడు. వెర్‌స్టాపెన్‌కిది 17వ టైటిల్. లూయిస్ హామిల్టన్, ఫెర్నాండొ అలాన్సొ రెండు, మూడు స్థానాలలో నిలిచారు.

18 నుంచి లెజెండ్స్ లీగ్ క్రికెట్

న్యూఢిల్లీ: లెజెండ్స్ లీగ్ క్రికెట్(ఎల్ ఎల్‌సీ) రెండో ఎడిషన్‌కు రంగం సిద్ధమైంది. ఈ నెల 18 నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు డెహ్రాడూన్, రాంచీ, జమ్ము, విశాఖపట్నం, సూరత్ నగరాల్లో లెజెండ్స్ లీగ్ మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఇందులో అర్బన్ రైజర్స్ హైదరాబాద్, ఇండియా క్యాపిటల్స్, మణిపాల్ టైగర్స్, గుజరాత్ జెయింట్స్, సదరన్ సూపర్ స్టార్స్, బిల్వారా కింగ్స్ పోటీపడుతున్నాయి. అయితే రెండో సీజన్‌కు ప్రచారం కల్పించడంలో భాగంగా వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఎల్ఎల్‌సీ ట్రోఫీ టూర్ నిర్వహిస్తామని నిర్వాహకులు ప్రకటించారు.

షకీబల్ (82)

బంగ్లా భళా

శ్రీలంకపై అద్భుత విజయం రాణించిన నజ్ముల్, షకీబ్ • అసలంక సెంచరీ వృథా

వన్డే ప్రపంచకప్‌లో మరో ఆసక్తికర పోరు అభిమానులను ఆద్యంతం అలరించింది. వాతావరణం కాలుష్యం కారణంతో అసలు మ్యాచ్ జరుగుతుందా లేదా అన్న అనుమానాల మధ్య సాగిన పోరులో శ్రీలంకపై బంగ్లాదేశ్‌దే పైచేయి అయ్యింది. చరిత అసలంక సెంచరీతో పోరాడే స్కోరు అందుకున్న లంక..బంగ్లాను నిలువరించలేకపోయింది. కెప్టెన్ షకీబల్ హసన్, నజ్ముల్ హసన్ అర్ధసెంచరీలతో 53 బంతులు మిగిలుండగానే విజయాన్ని ఖాతాలో వేసుకుంది. వరుసగా ఆరు ఓటములకు పుల్‌స్టాప్ పెడుతూ లంకను మెగాటోర్నీ నుంచి దిగ్విజయంగా సాగనంపింది. మ్యాచ్ మొత్తం ఒక ఎత్తయితే సుదీర్ఘ క్రికెట్ చరిత్రలో అంజెలో మాథ్యూస్ టైమ్ ఔట్ నిర్ణయం హైలెట్‌గా నిలువడం విశేషం.

ఢిల్లీ: వన్డే ప్రపంచకప్‌లో శ్రీలంక వరుస ఓటముల పరంపర దిగ్విజయంగా కొనసాగుతున్నది. మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా భారత్ చేతిలో భారీ ఓటమితో కృంగిపోయిన లంకను బంగ్లాదేశ్ చావుదెబ్బ కొట్టింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో బంగ్లా 3 వికెట్ల తేడాతో లంకను ఓడించింది. తొలుత చరిత అసలంక(105 బంతుల్లో 108, 6ఫోర్లు, 5సిక్స్‌లు) సాధికారిక సెంచరీతో లంక 49.3 ఓవర్లలో 279 పరుగులు చేసింది. సమరవిక్రమ(41), పతున్ నిస్సనక(41) ఆకట్టుకున్నారు. తంజిమ్ హసన్(3/80) మూడు వికెట్లు పడగొట్టగా, షకీబల్ హసన్, షరీపుల్ రెండేసి వికెట్లు తీశారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన బంగ్లా 41.1 ఓవర్లలో 282/7 స్కోరు చేసింది. నజ్ముల్ హుసేన్(90), షకీబల్ హసన్(82) అర్ధసెంచరీలతో జట్టు విజయంలో కీలక భూమిక పోషించారు. 41 పరుగులకే ఓపెనర్లు లిటన్ దాస్(23), తంజిద్ హసన్(9) వికెట్లు కోల్పోయిన బంగ్లాను వీరిద్దరు తమ ఇన్నింగ్స్‌తో నిలబెట్టారు. మదుషనక(3/69) మూడు వికెట్లతో రాణించగా, తీక్షణ, మాథ్యూస్ రెండేసి వికెట్లు ఖాతాలో వేసుకున్నారు. రెండు వికెట్లకు తోడు అర్ధసెంచరీతో రాణించిన షకీబల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

అసలంక అదుర్స్:

వరుస ఓటముల నుంచి తేరుకోవాలనుకున్న లంకకు బంగ్లా రూపంలో మరో ఎదురుదెబ్బ తగిలింది. టాప్-8లో నిలువడం ద్వారా చాంపియన్స్ ట్రోఫీ(2025)కి అర్హత సాధించాలనుకున్న లంక ఆశలపై బంగ్లా నీళ్లు గుమ్మరించింది. కుశాల్ పెరెరా(4) రూపంలో లంక తొలి వికెట్ కోల్పోగా, కెప్టెన్ కుశాల్ మెండిస్(19) ఆకట్టుకోలేకపోయాడు. ఒకా నొక దశలో 135 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన లంకను అసలంక ఆదుకున్నాడు. సహచర బ్యాటర్ల అండతో బంగ్లా బౌలింగ్‌ను దీటుగా ఎదుర్కొంటూ కెరీర్‌లో రెండో సెంచరీ ఖాతాలో వేసుకున్నాడు.

నజ్ముల్, షకీబ్ సూపర్

నిర్దేశిత లక్ష్యఛేదనలో బంగ్లాకు సరైన శుభారంభం దక్కలేదు. ఓపెనర్లు లిటన్ దాస్, తంజిద్ హసన్ ఆకట్టుకోలేకపోయారు. ఈ క్రమంలో నజ్ముల్, షకీబ్ సాధికారిక ఇన్నింగ్స్‌తో కదంతొక్కారు. వీరిద్దరు లంక బౌలర్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తూ స్కోరుబోర్డుకు పరుగులు జతచేశారు. మూడో వికెట్‌కు వీరిద్దరు కలిసి 169 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడం విజయానికి కారణమైంది. ఆఖర్లో లంక పుంజుకునేందుకు ప్రయత్నించినా బంగ్లా పోరాటంతో ఫలితం లేకపోయింది. మాథ్యూస్ వరుస ఓవర్లలో షకీబ్, నజ్ముల్‌ను ఔట్ చేసినా అప్పటికే జరుగాల్సిన నష్టం జరిగిపోయింది.

సంక్షిప్త స్కోర్లు

శ్రీలంక: 49.3 ఓవర్లలో 279 ఆలౌట్(అసలంక 109, నిస్సనక 41, తంజిమ్ 3/80, షరీపుల్ 2/51), **బంగ్లాదేశ్:** 41.1 ఓవర్లలో 282/7(నజ్ముల్ 90, షకీబల్ 82, మదుషనక 3/69, మాథ్యూస్ 2/35)

ప్రపంచ కప్ పాయింట్ల పట్టిక

దే	ఆ	గె	ఓ	ర.రే.	పా
భారత్ ✓	8	8	0	+2.45	16
దక్షిణాఫ్రికా ✓	8	6	2	+1.37	12
ఆస్ట్రేలియా	7	5	2	+0.92	10
న్యూజిలాండ్	8	4	4	+0.39	8
పాకిస్థాన్	8	4	4	+0.03	8
అఫ్గానిస్థాన్	7	4	3	-0.33	8
బంగ్లాదేశ్ X	8	2	6	-1.14	4
శ్రీలంక X	8	2	6	-1.16	4
నెదర్లాండ్స్ X	7	2	5	-1.39	4
ఇంగ్లండ్ X	7	1	6	-1.50	2

నోట్: దే: దేశం, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర: రన్‌రేట్, పా: పాయింట్స్

మాథ్యూస్ టైమ్ 'ఔట్'

వివాదస్పద రీతిలో లంక బ్యాటర్ ఔట్ క్రికెట్ చరిత్రలో తొలిసారి నమోదు

న్యూఢిల్లీ: సుదీర్ఘ క్రికెట్ చరిత్రలో ఇప్పటి వరకు కనీవినీ ఎరుగని ఘటన చోటు చేసుకుంది. అసలు ఇలా కూడా ఒక బ్యాటర్ ఔట్ అవుతాడా అన్న రీతిలో జరుగడం యావత్ క్రికెట్ అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. శ్రీలంక, బంగ్లాదేశ్ ప్రపంచకప్ మ్యాచ్ ఇందుకు వేదికైంది. లంక బ్యాటింగ్ చేస్తున్న సమయంలో షకీబల్ వేసిన ఇన్నింగ్స్ 25వ ఓవర్‌లో ఇది చోటు చేసుకుంది. సదీరా సమరవిక్రమ ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన ఆల్‌రౌండర్ అంజెలో మాథ్యూస్ హెల్మెట్ సరిగ్గా లేకపోవడాన్ని గుర్తించాడు. దీంతో వెంటనే డగౌట్‌లో ఉన్న సహచరులకు సైగ చేసి హెల్మెట్ తీసుకురమ్మన్నాడు. ఇదంతా నిశితంగా పరిశీలిస్తున్న బంగ్లా కెప్టెన్ షకీబ్..అంపైర్‌కు 'హౌ ఈజ్ దట్' అంటూ అప్పీల్ చేశాడు. దీంతో లెగ్ అంపైర్‌తో చర్చించిన అంపైర్..మాథ్యూస్‌ను దగ్గరికి పిలిచి మాట్లాడాడు. అప్పటికే నిర్ణీత సమయం మించిపోవడం మాథ్యూస్ గార్డ్ తీసుకోకపోవడంతో అంపైర్ ఔట్‌గా ప్రకటించాడు. దీంతో ఒక్కసారిగా అవాక్కు అయిన మాథ్యూస్ జరిగిన పరిణామాన్ని షకీబ్‌కు వివరించే ప్రయత్నం చేశాడు. దీంతో కనీసం ఒక్క బంతి ఎదురుకోకుండానే ఔట్ కావడంతో మాథ్యూస్ బౌండరీ దగ్గర హెల్మెట్‌ను నేలకేసి కొట్టి తన కోపాన్ని ప్రదర్శించాడు.

అసలేంటి టైమ్ ఔట్?

ఐసీసీ నిబంధనలను అనుసరించి ఆర్టికల్ 40.11 ప్రకారం వికెట్ పడిన తర్వాత మూడు నిమిషాల్లో కొత్త బ్యాటర్ బంతిని ఎదుర్కోవాలి. అలా జరుగని పక్షంలో బ్యాటర్‌ను టైమ్ ఔట్‌గా ప్రకటిస్తారు. ప్రస్తుత ప్రపంచకప్‌లో దీన్ని ఒక నిమిషానికి తగ్గిస్తూ రెండు నిమిషాలుగా నిర్ణయించారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.